

కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా?
కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ప్రాజెక్టులకు కేటాయించే నిధులపై సంశయం నెలకొంది.
- 8లో



మినీ జాతరకు సిద్ధం
మేడారం సమ్మక్క-సారలమ్మ మినీ జాతరకు అధికారులు సిద్ధమయ్యారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి.
-8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
33.0° /18.0°
జిల్లాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. రాత్రిపూట చలిగా ఉంటుంది.

న్యూస్‌రీల్

పార్ట్‌టైం లెక్చరర్లను అప్‌గ్రేడ్ చేయాలి



కేయూ క్యాంపస్: కేయూలో పనిభారంతో విధులు నిర్వర్తిస్తున్న పార్ట్‌టైం లెక్చరర్లను కాంట్రాక్టు లెక్చరర్లుగా అప్‌గ్రేడ్ చేయాలని కేయూ పార్ట్‌టైం లెక్చరర్ల సంఘం అధ్యక్షుడు సోల్తి కిరణ్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు పార్ట్‌టైం లెక్చరర్ల బాధ్యులు సోమవారం క్యాంపస్‌లో పాలక మండలి సభ్యులు డాక్టర్ నాగేంద్ర బాబు, డాక్టర్ మదన్‌కుమార్, డాక్టర్ చంద్రమౌళి, ప్రొఫెసర్ మల్లారెడ్డి, సుమతి, ఉమామహేశ్వరి, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావును సోమవారం కలిసి వినతిపత్రాలు సమర్పించారు. ఈ సందర్భంగా బాధ్యులు మాట్లాడుతూ చాలీచాలని వేతనాలతో ఇబ్బంది పడుతున్న తమను అప్‌గ్రేడ్ చేయాలన్నారు. పాలక మండలి సభ్యులను కలిసిన వారిలో జనరల్ సెక్రటరీ సతీష్‌రాజు, బాధ్యులు కుమార్, మోహన్, సాయికృష్ణ, సమత, శ్యాంసుందర్, మౌనిక, యశోదర, భరత్, వెంకట్, రజనీకాంత్, శ్రీధర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్‌లో టీచర్ల సీనియార్టీ జాబితా

కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు



హన్మకొండ అర్బన్: జిల్లాలో టీచర్ల బదిలీలు, పదోన్నతులకు సంబంధించి సీనియార్టీ జాబితా, ఖాళీల జాబితాను ఆన్‌లైన్‌లో నమోదు చేసినట్లు కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు తెలిపారు. సోమవారం రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, గిరిజన అభివృద్ధి శాఖ మంత్రి సత్యవతిరాథోడ్, మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతి కుమారి జిల్లా అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పలు అంశాలపై సమీక్ష నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల సీనియార్టీ జాబితా ఆన్‌లైన్‌లో నమోదు చేయడం జరిగిందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌ఓ వాసుచంద్ర, పరకాల ఆర్డీఓ రాము, డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు, డీఈఓ అబ్దుల్‌హై, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

పదోన్నతులివ్వకపోతే బోధించం



విద్యారణ్యపురి: భాషా పండితులకు, పీఈటీలకు పదోన్నతులు ఇవ్వనందుకుగాను 9వ తరగతి, 10వ తరగతి విద్యార్థులకు విద్యా బోధన చేయబోమని, బోధనను నిలిపేస్తున్నట్లుగా రాష్ట్రీయ పండిత పరిషత్(ఆర్‌యూపీపీ) వరంగల్ జిల్లా అధ్యక్షుడు కక్కెర్ల రమేశ్ స్పష్టం చేశారు. ఈమేరకు సోమవారం తాను పని చేస్తున్న వరంగల్ జిల్లాలోని దుగ్గొండి మండలం మహ్మదాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం నర్సింహాచార్యులకు సోమవారం ఎల్‌పీ రమేశ్, పీఈటీ నరేశ్ వినతిపత్రం అందించారు. వరంగల్ జిల్లాలో భాషా పండితులు, పీఈటీ జాక్ పిలుపు మేరకు ఫిబ్రవరి 1 నుంచి విద్యా బోధనను నిలిపేసి ఆందోళనలో భాగస్వాములు కావాలని రమేశ్ పిలుపునిచ్చారు.

బదిలీల దరఖాస్తు గడువు పొడిగింపు

విద్యారణ్యపురి: ఉపాధ్యాయులు బదిలీల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు గడువు పొడిగించారని డీఈఓ ఎండీ.అబ్దుల్‌హై తెలిపారు. సోమవారంతో గడువు ముగియగా.. దరఖాస్తు చేసుకునేందుకు ఫిబ్రవరి ఒకటో తేదీ వరకు అవకాశం ఉందని పేర్కొన్నారు.

గాంధీజీకి నివాళులర్పించిన సీపీ



వరంగల్ క్రైం: మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పోలీస్ కమిషనర్ ఏవీ రంగనాథ్ గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సెంట్రల్ జోన్, ఈస్ట్‌జోన్ డీసీపీలు ఎంఏ బారి, పుల్లా కరుణాకర్, అదనపు డీసీపీ సంజీవ్, ఏసీపీలు, ఇన్‌స్పెక్టర్లు, ఆర్‌ఐలు పాల్గొన్నారు.

నేడు రామన్న రాక..

- కమలాపూర్‌లో మంత్రి కేటీఆర్ పర్యటనకు భారీ ఏర్పాట్లు
- పర్యవేక్షించిన మంత్రులు ఎర్రబెల్లి, గంగుల, కలెక్టర్, సీపీలు
- రూ.49కోట్ల అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు
- హైదరాబాద్ నుంచి హెలికాప్టర్‌లో కమలాపూర్‌కు..



విద్యుత్ వెలుగుల్లో ఎంజేపీ బాలికల పాఠశాల



ప్రారంభానికి ముస్తాబైన కుల సంఘాల భవనం

సాక్షిప్రతినిధి, వరంగల్/కమలాపూర్: హనుమకొండ-కరీంనగర్ జిల్లాల పరిధిలోని హుజూరాబాద్ నియోజకవర్గం కమలాపూర్, జమ్మికుంట, హుజూరాబాద్ మండలాల్లో రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు(కేటీఆర్) మంగళవారం పర్యటించనున్నారు. కేటీఆర్ కమలాపూర్‌లో తొలిసారిగా పర్యటించనున్న నేపథ్యంలో మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గంగుల కమలాకర్, కలెక్టర్ రాజీవ్‌గాంధీ, సీపీ రంగనాథ్ ఏర్పాట్లను పర్యవేక్షించగా.. అధికారులు ఏర్పాట్లను ముమ్మరం చేశారు. మండలంలోని గూడూరు శివారులో హెలిపాడ్ ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి కాన్వాయ్‌లో బయలుదేరి పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసే విధంగా అధికారులు ఏర్పాట్లు చేశారు. కాగా.. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా సీపీ రంగనాథ్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఘన స్వాగతం పలకనున్న పార్టీ శ్రేణులు

కేటీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు మండల ప్రజాప్రతినిధులు, బీఆర్‌ఎస్ శ్రేణులు సమాయత్తమయ్యారు. ఈ మేరకు అన్ని ప్రధాన కూడళ్ల తోపాటు ప్రధాన రహదారుల వెంట భారీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. మంత్రి కేటీఆర్ కమలాపూర్‌కు చేరుకోగానే వందలాది వాహనాలు, ద్విచక్ర వాహనాలతో భారీ ర్యాలీ చేపట్టి ఘన స్వాగతం పలకాలని నేతలు యోచిస్తున్నారు.

నాకు సమాచారం లేదు: ఎమ్మెల్యే ఈటల

అభివృద్ధి పనులకు సంబంధించి తనకు ఎలాంటి సమాచారం లేదని ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తెలిపారు. ఎలాంటి ఆహ్వానం అందలేదన్నారు.

కేటీఆర్ టూర్ షెడ్యూల్ ఇలా..



- ఉదయం 11 గంటలకు హెలికాప్టర్ ద్వారా కమలాపూర్‌కు చేరుకుంటారు.
- ఉదయం 11 గంటలకు బస్టాండ్ నిర్మాణం, కమ్యూనిటీ హాళ్లు, దేవాలయాల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తారు.
- 12 గంటలకు కమ్యూనిటీ హాల్ కాంప్లెక్స్ ప్రారంభోత్సవం
- మధ్యాహ్నం 12.30 గంటలకు మహాత్మా జ్యోతిబాపూలే బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాలలు (బాలికలు, బాలుర) ప్రారంభోత్సవం, జూనియర్ కాలేజీ, కస్తూర్బా జూనియర్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారు.
- మధ్యాహ్నం ఒంటిగంటకు మహాత్మా జ్యోతిబాపూలే పాఠశాల పిల్లలతో కలిసి భోజనం చేస్తారు.
- మధ్యాహ్నం 2 గంటలకు కమలాపూర్ నుంచి జమ్మికుంటకు రోడ్డు మార్గాన వెళ్తారు.
- మధ్యాహ్నం 2.30 గంటలకు జమ్మికుంటలో బహిరంగ సభలో పాల్గొంటారు.
- సాయంత్రం 5 గంటలకు జమ్మికుంట నుంచి హుజూరాబాద్‌కు రోడ్డు మార్గాన వెళ్తారు.
- సాయంత్రం 5.15 గంటలకు హుజూరాబాద్ నుంచి హైదరాబాద్‌కు తిరుగు పయనమవుతారు.

కట్టడాలకు కళ్లెం వేయరూ..

- ఆక్రమణలపై దృష్టి సారించాలని వినతులు
- గ్రేటర్ వరంగల్ గ్రీవెన్స్‌కు 65 ఫిర్యాదులు



బల్దియా ప్రధాన కార్యాలయంలో వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: నగరంలో ఖాళీ స్థలాల కబ్జాలు, రోడ్ల ఆక్రమణలు, అనుమతి లేని భవన నిర్మాణాలు, సెట్ బ్యాక్ లేని కట్టడాలకు కళ్లెం వేయాలంటూ పలువురు గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్యకు వినతులు సమర్పించారు. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయ కౌన్సిల్ హాల్‌లో గ్రీవెన్స్ సెల్‌లో వివిధ కాలనీలకు చెందిన ప్రజలు ఫిర్యాదు చేశారు. మొత్తం 65 ఫిర్యాదులు రాగా.. వాటిలో టౌన్ ప్లానింగ్ విభాగానికి 31, ఇంజనీరింగ్ 20, పన్నులు 7, ప్రజారోగ్యం–శానిటేషన్ 4, నీటి సరఫరా విభాగానికి 3 చొప్పున ఫిర్యాదులు అందాయి. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ రవీందర్ యాదవ్, ఎస్ఈ కృష్ణారావు, సీఎంహెచ్‌ఓ జ్ఞానేశ్వర్, సిటీ ప్లానర్ వెంకన్న, డిప్యూటీ కమిషనర్లు అనిసుర్ రషీద్, జోనా, శ్రీనివాసరెడ్డి, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, ఎంహెచ్‌ఓ రాజేశ్, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు కొన్ని ఇలా..

- పలివేల్పుల దుర్గా నగర్ మెయిన్ రోడ్డుపై ఓ వ్యక్తి భవన నిర్మాణం చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు వినతిపత్రం అందజేశారు.
- హంటర్ రోడ్డు జూ పార్కులోకి 16 కాలనీల మురుగునీరు చేరుతోందని, దీన్ని నియంత్రించాలని నాలుగుసార్లు ఫిర్యాదు చేసినా ఇంజనీర్లు పట్టించుకోవడం లేదని పౌర స్పందన వేదిక ప్రధాన కార్యదర్శి నల్లెల రాజయ్య ఫిర్యాదు చేశారు.
- హనుమకొండ పోచమ్మకుంటలోని ఇళ్లకు నంబర్లు ఇవ్వాలని కోరుతూ పలుమార్లు వినతులు సమర్పించామని కాలనీవాసులు విన్నవించారు.
- హంటర్ రోడ్డు 31వ డివిజన్ హనుమాన్ నగర్‌లో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మించాలని కాలనీవాసులు విన్నవించారు.
- వడ్డేపల్లి ఆదర్శ సొసైటీ కాలనీలో సెల్లార్‌ను నిబంధనల ప్రకారం నిర్మించడం లేదని, ఇప్పటి వరకు 12 సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కమిషనర్‌కు విజ్ఞప్తి చేశారు.
- 10, 11 డివిజన్లలో తాగునీటి సరఫరా పైపులైన్లు వేసి, నల్లా కనెక్షన్లు ఇవ్వాలని, రోడ్ల గుంతలు పూడ్చాలని కాలనీవాసులు కోరారు.
- వడ్డేపల్లి సురేంద్రపురి కాలనీలో వెటర్నరీ, ఇతర ఉద్యోగుల కోఆపరేటివ్ హౌసింగ్ సొసైటీలో రెండు ఖాళీ స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, చర్యలు తీసుకోవాలని ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు.
- హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో వాకర్స్ కోసం పబ్లిక్ టాయిలెట్లు నిర్మించాలని వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కోరారు.
- 55వ డివిజన్ భీమారం చెరువు సర్వే నం.642లో 68 ఎకరాల చెరువు కబ్జాకు గురవుతోందని, దీనిని పరిరక్షించాలని స్థానికులు వినతిపత్రం అందజేశారు.
- వరంగల్ నాయుడు పెట్రోల్ పంపు 33–5–349 నుంచి 121 వరకు సీసీ డ్రెయినేజీ నిర్మించాలని ఎమ్మెల్సీ బండా ప్రకాశ్‌కు స్థానికులు లేఖ అందజేశారు.

వాటి అనుమతులు రద్దు చేయండి

గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య



రాంపూర్‌లో లే అవుట్ స్థలాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ ప్రావీణ్య

వరంగల్ అర్బన్: లే అవుట్ లేకుండా వెలుస్తున్న స్థలాలు, భవన నిర్మాణాల్లో నిబంధనలు పాటించకపోతే వెంటనే వాటి అనుమతులు రద్దు చేయాలని గ్రేటర్ వరంగల్ కమిషనర్ ప్రావీణ్య హెచ్చరించారు. విలీన గ్రామాలైన రాంపూర్, మడికొండ ప్రాంతాల్లో లే అవుట్ అనుమతుల ప్లాన్‌లను క్షేత్రస్థాయిలో సోమవారం ఆమె తనిఖీ చేశారు. డాక్యుమెంట్లు, ఎన్‌ఓసీలు, అభివృద్ధి పనులపై ఉన్న సందేహాలను కమిషనర్ అడిగి నివృత్తి చేసుకున్నారు. 61వ డివిజన్‌లో ఏర్పాటు చేసిన రెండు పట్టణ ప్రకృతి వనాలను పరిశీలించారు. 'వావ్ వరంగల్'ను తిలకించి చుట్టూ ప్రహరీ నిర్మాణానికి ప్రతిపాదనలు అందజేయాలని ఇంజనీర్లను ఆదేశించారు. ఇటీవల బల్దియా కొనుగోలు చేసిన భవనాల కూల్చివేత పరికరాలను పరిశీలించారు. పలు డివిజన్లలో పూర్తయిన అభివృద్ధి పనుల నాణ్యతా ప్రమాణాలను పరిశీలించి.. నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. తనిఖీల్లో కమిషనర్ వెంట సీపీ వెంకన్న, ఈఈ రాజయ్య, డీఎఫ్‌ఓ శంకర్‌లింగం, ఏసీపీ బషీర్, డీఈలు సంతోశ్‌బాబు, ఏఈలు ఉన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

హన్మకొండ: ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు సలహాలు, సూచనలు స్వీకరించడానికి డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ హనుమకొండ డిపో మేనేజర్ బాబునాయక్ తెలిపారు. ఈనెల 31న ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ఈకార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. జమ్మికుంట, వేలేరు, ఐనవోలు, పర్వతగిరి, ఖిలా వరంగల్, హనుమకొండ, హసన్‌పర్తి, కమలాపూర్, వరంగల్, కాజీపేట మండలాల పరిధి ప్రజలు 99592 26049 నంబర్‌కు ఫోన్ చేసి సలహాలు, సూచనలివ్వాలని కోరారు.

సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

వరంగల్ కలెక్టర్ గోపి



వినతులు స్వీకరిస్తున్న వరంగల్ కలెక్టర్ గోపి

కరీమాబాద్: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకే ప్రజావాణి నిర్వహిస్తున్నట్లు వరంగల్ కలెక్టర్ గోపి తెలిపారు. గ్రీవెన్స్‌లో భాగంగా సోమవారం ఆయన ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈసందర్భంగా కలెక్టర్ గోపి మాట్లాడుతూ.. గ్రీవెన్స్‌పై ప్రజల నమ్మకం కోల్పోకుండా అధికారులు వారి సమస్యలు పరిష్కరించాలని సూచించారు. కలెక్టరేట్‌లో మహాత్మాగాంధీ వర్ధంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కంటి వెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కాగా.. ప్రజావాణికి మొత్తం 45 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ, శ్రీవత్స ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

గాంధీ మార్గం అందరికీ ఆదర్శం

డీసీసీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి



గాంధీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీసీసీ అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి

హన్మకొండ చౌరస్తా: జాతీయ సమగ్రత, ఐక్యతను నిలబెట్టేందుకు జాతిపిత మహాత్మా గాంధీ అనుసరించిన మార్గం అందరికీ ఆదర్శమని హనుమకొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం గాంధీ వర్ధంతిని నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయిని మాట్లాడుతూ భారతదేశానికి స్వాతంత్ర్యం తెచ్చేందుకు అహింసా మార్గంలో పోరాటం చేసిన నాయకులలో గాంధీ అగ్రగణ్యుడన్నారు. మహాత్మా గాంధీ నమ్మిన సిద్ధాంతాలను ఆచరిస్తూ.. ఆయన ఆశయాలను నెరవేర్చినప్పుడే నిజమైన నివాళి అర్పించినట్లవుతుందన్నారు. ఆయన మరణించిన రోజును యావత్ భారత్ షహీద్ దివస్‌గా జరుపుకుంటోందన్నారు. కార్యక్రమంలో మాజీ మేయర్ ఎర్రబెల్లి స్వర్ణ, వర్ధన్నపేట నియోజకవర్గ కో–ఆర్డినేటర్ నమిండ్ల శ్రీనివాస్, నాయకులు కూచన రవళి, బంక సరళ, బొమ్మతి విక్రమ్, కూర వెంకట్, నజీమ్ జహాస్, తౌటం రవీందర్, సత్యనారాయణ, నేహాల్, సంపత్, నసీర్, లలిత పాల్గొన్నారు.

వినతులు సత్వరమే పరిష్కరించాలి

అదనపు కలెక్టర్ సంధ్యారాణి



వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ సంధ్యారాణి

హన్మకొండ అర్బన్: ప్రజావాణిలో బాధితుల నుంచి స్వీకరించిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అదనపు కలెక్టర్ సంధ్యారాణి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఫిర్యాదులు పరిష్కరించడంలో అధికారులు కాలయాపన చేయొద్దన్నారు. రెవెన్యూ శాఖ 40, ఎంపీడీఓ 12, కలెక్టరేట్ డీ సెక్షన్ 10, కార్పొరేషన్‌కు సంబంధించిన 10 ఫిర్యాదులతోపాటు మొత్తం 95 వినతులు స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ముందు మహాత్మా గాంధీ వర్ధంతి, అమరవీరుల దినోత్సవం సందర్భంగా జిల్లా అధికారులు, సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ సంధ్యారాణి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో డీఎండబ్ల్యూఓ శ్రీనివాస్, డీడబ్ల్యూఓ సబిత, డీసీఎస్‌ఓ వసంతలక్ష్మి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మాధవీలత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దు

డీఎంహెచ్‌ఓ సాంబశివరావు

కాజీపేట రూరల్: కుష్ఠు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపకుండా వారిని ఆదరించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ సాంబశివరావు అన్నారు. కాజీపేట ఫాతిమా నగర్ సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ కార్యాలయంలో సోమవారం సొసైటీ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతి–జాతీయ కుష్ఠు వ్యాధి నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్పర్శ్ కుష్ఠు వ్యాధి అవగాహన, నిర్మూలన పక్షోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి రహిత సమాజం కోసం కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అనంతరం 55 మంది వ్యాధిగ్రస్తులకు దుప్పట్లు, పండ్లు, చెప్పులు, మందులు పంపిణీ చేసి భోజనాలు పెట్టారు. కార్యక్రమంలో అదనపు డీఎంహెచ్‌ఓ మదన్‌మోహన్‌రావు, జిల్లా ఆరోగ్య విద్యాధికారి సందెల శ్రీనివాస్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ యాకూబ్‌పాషా, డబ్ల్యూహెచ్ కన్సల్టెంట్ డాక్టర్ శిరీష, బోడగుట్ట మెడికల్ ఆఫీసర్ పసునూరి జెరూష సృజన, సర్వప్రేమ సొసైటీ అధ్యక్ష, కార్యదర్శులు పి.బాలస్వామిరెడ్డి, హెచ్.ప్రభాకర్, రాష్ట్ర బెస్ట్ సోషల్ వర్కర్ ఫాదర్ జెరోమ్, వై.భాస్కర్‌రెడ్డి, ఎస్.సదానందం తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్యాలెండర్ ఆవిష్కరించిన కలెక్టర్



కాజీపేట: షెడ్యూల్డ్ కులాల హక్కుల సమితి కార్మిక విభాగం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఆవిష్కరించారు. హనుమకొండ కలెక్టరేట్ కార్యాలయ ఆవరణలో కార్మిక సంఘం నాయకులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరించి.. పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యమడాల అనుకాంత్, ఉప్పుల రవి, సంద్ర కుమార్, ఈదుల యాకయ్య, శంకర్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్‌పై కేసు

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ వీసీ ఆచార్య తాటికొండ రమేష్, మాజీ రిజిస్ట్రార్ ఆచార్య బి.వెంకట్రామ్‌రెడ్డితోసహా ఫైనాన్స్ ఆఫీసర్ టి.రాజయ్య పై కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. కాకతీయ యూనివర్సిటీ పోలీస్‌స్టేషన్‌లో జిల్లాకోర్టు ఆదేశాల మేరకు వారిపైన 418, 425, 405, 406, 408,409 సెక్షన్లకింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజకుమార్ సోమవారం తెలిపారు. యూనివర్సిటీలో 2010లో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామకాలు జరిగాయి. అందులో అవకతవకలు జరిగాయని అప్పట్లోనే ఆరోపణలు వచ్చిన విషయం విధితమే. వారితో కుమ్మక్కుఅయి వారిని ఉద్యోగంలో కొనసాగిస్తూ నిబంధనలకు విరుద్ధంగా అసిస్టెంట్ ప్రొఫెసర్లకు వేతనాలను కూడా చెల్లిస్తున్నారని తమప్రతిష్టకు భంగం కలిగించేలా ప్రవర్తిస్తున్నారని డాక్టర్ వినితనాయినీ జిల్లాకోర్టులో గత ఏడాది సెప్టెంబర్‌లో కేసు వేశారు. దీంతో జిల్లా కోర్టు ఇటీవల ఇచ్చిన ఆదేశాల మేరకు కేయూ పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 28న పోలీసులు వీసీ, మాజీ రిజిస్ట్రార్, ఫైనాన్స్ ఆఫీసర్లపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిసింది.

గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య

కమలాపూర్: కమలాపూర్ మండలంలోని ఉప్పల్–జమ్మికుంట రైల్వే స్టేషన్ల మధ్య ఏపీ ఎక్స్‌ప్రెస్ రైలు కింద పడి గుర్తు తెలియని వ్యకి సోమవారం ఆత్మహత్య చేసుకున్నట్లు మంచిర్యాల జీఆర్‌పీ హెడ్ కానిస్టేబుల్ కెంసారం సంపత్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడికి సుమారు 40 ఏళ్ల వయ సు ఉంటుందని, మృతుడి వద్ద ఎలాంటి అడ్రస్, ఆధారాలు లేవని, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్, తెలుపు రంగు చుక్కల షర్ట్ ధరించి ఉన్నాడని తెలిపారు. మెడకు నల్లని దారం, ఆంజనేయు ని బొమ్మగల మెటల్ లాకెట్, కుడి చేతికి తెలు పు రంగు ఉంగరం, కుడి చేతిపై ఏ అనే పచ్చబొట్టు ఉన్నాయని తెలిపారు. మృతదేహాన్ని జమ్మికుంట ప్రభుత్వాస్పత్రి మార్చురీలో భద్రపరిచినట్లు వెల్లడించారు. ఈ సమాచారాన్ని మృతుడి బంధువులకు చేరే వరకు వాట్సాప్ గ్రూపుల్లో పంపించాలని, పూర్తి వివరాలకు 83285 12176, 94409 00792 నంబర్లలో సంప్రదించాలన్నారు.

రెస్టారెంట్‌లో వ్యక్తి మృతి



దేవరాజ్ (ఫైల్)

కాశిబుగ్గ: కాశిబుగ్గ జంక్షన్‌లోని సరసబార్ అండ్ రెస్టారెంట్‌లో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం కరీంనగర్ జిల్లా జమ్మికుంట మండలం నారాయణపల్లికి చెందిన వరికెల దేవరాజ్ (55) కొన్నేళ్ల క్రితం కాశిబుగ్గకు వచ్చి రియల్ ఏస్టేట్ వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఈక్రమంలో సోమవారం సాయంత్రం మద్యం తాగడానికి బార్‌కు వెళ్లి మద్యం తాగి బాత్‌రూంకు వెళ్లి అక్కడే మృతిచెందాడు. దేవరాజు గుండెపోటుతో మరణించినట్లుగా పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కొత్త ప్రాజెక్టులు పట్టాలెక్కేనా!

గత బడ్జెట్‌లలో కేటాయింపులు తక్కువే..

- కలగానే కాజీపేట డివిజన్..
- పెండింగ్‌లో కాజీపేట–సికింద్రాబాద్ మూడోలైన్
- ఈసారి బడ్జెట్‌పై ప్రజల ఆశలు



సాక్షి ప్రతినిధి, వరంగల్: కేంద్ర బడ్జెట్ కోసం ప్రతీసారి చేస్తున్న ప్రతిపాదనలకు మోక్షం లభించకపోవడంతో కీలకమైన ప్రాజెక్టుల పనులు పట్టాలెక్కడం లేదు. ఈ బడ్జెట్‌లోనైనా ఎంపీల ప్రతిపాదనలకు ఫలితం ఉంటుందా.. అనే చర్చ జరుగుతోంది. రేపు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టే పెద్ద పద్దులో ఉమ్మడి వరంగల్ జిల్లాకు ఏమేరకు వాటా ఉంటుందనే సంశయం నెలకొంది. మూడు బడ్జెట్‌ల సమయంలో ప్రతిపాదనలు చేసినా.. కాళేశ్వరానికి జాతీయ హోదా దక్కకపోగా, బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీ, కాజీపేట రైల్వేకోచ్, పీఓహెచ్ షెడ్‌కు స్థల కేటాయింపు, కొత్త రైల్వేలైన్ల ప్రతిపాదనలు, సర్వేలు కాగితాలకే పరిమితమయ్యాయి. 2023–24 బడ్జెట్‌లోనైనా సరిపడా నిధులు కేటాయిస్తారని ఓరుగల్లు వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

పెండింగ్‌లో కీలక ప్రాజెక్టులు

పెండింగ్ రైల్వే లైన్లు, బ్రిడ్జిల నిర్మాణానికి నిధులు ఇవ్వలేదు. కాజీపేట మీదుగా బల్లార్షా– విజయవాడ మూడో లైన్ నిర్మాణ పనులు మాత్రమే జరుగుతుండగా, కాజీపేట డివిజన్ కేంద్రం ఏర్పాటు, బల్లార్షా– కాజీపేట ఫోర్త్ లైన్ నిర్మాణం పెండింగ్‌లో ఉన్నాయి. కాజీపేట నుంచి సికింద్రాబాద్ వరకు మూడో రైల్వేలైన్ సర్వే ప్రతిపాదన పెండింగ్‌లో ఉంది. కాజీపేట– హసన్‌పర్తి –హుజూరాబాద్ – కరీంనగర్ కొత్త రైల్వేలైన్.. సర్వే ప్రతిపాదనలు దాటలేదు. కొత్తగూడెం, మణుగూరు నుంచి తాడ్వాయి అడవుల మీదుగా రామగుండం, భూపాలపల్లికి రెండు మార్గాల్లో సర్వే కోసం గతంలో బడ్జెట్‌లో ప్రతిపాదనలు రాగా ప్రైవేటు సంస్థతో సర్వేతో సరిపెట్టారు. కాగా, మన ఎంపీలు పలుమార్లు చేసిన ప్రతిపాదనలు కేంద్ర బడ్జెట్‌లో ప్రస్తావనకు నోచుకోలేదు. గ్రేటర్ వరంగల్‌కు 2016మే నాలుగో వారంలో సప్లమెంటరీ పోటీల్లో 'స్మార్ట్‌సిటీ'లో చోటు లభించింది. ఈ పథకంలో రూ.2వేల కోట్లకు పైగా అభివృద్ధి పనులను ప్రతిపాదించారు. 2021–22 బడ్జెట్‌లో రూ.160 కోట్లు కేటాయించి విడుదల చేయగా, 2022–23 బడ్జెట్‌లో ప్రత్యేకంగా పేర్కొన లేదు. హృదయ్ పథకం కింద కేంద్ర ప్రభుత్వం గత ఆరేళ్ల కిందట కేటాయించిన రూ.40 కోట్లతో వివిధ పనులు చేపట్టగా, గత బడ్జెట్‌లో ఇచ్చిందేమీ లేదు. గ్రేటర్ వరంగల్, కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ ఆథారిటీ (కుడా)లకు వాటా దక్కలేదు.

పీఓహెచ్‌కు రూ.900 కోట్ల అంచనా..

పిరియాడికల్ ఓవర్‌హాలింగ్ షెడ్ (పీఓహెచ్) కాజీపేట అయోధ్యపురంలో నిర్మించేందుకు కేంద్రం రూ.900 కోట్లతో అంచనా వేసింది. వ్యాగన్ రిపేర్ షెడ్ల నిర్మాణానికి ఎకరంన్నర స్థల సమస్య కారణంగా ఇప్పటికీ పనులు ప్రారంభం కాలేదు. పీఓహెచ్ కోసం రాష్ట్ర ప్రభుత్వం 150 ఎకరాల స్థలాన్ని దేవాదాయశాఖ నుంచి సేకరించి కేంద్రానికి అప్పగించగా, ముఖద్వారం వద్ద ఉన్న ఎకరంన్నర భూమి సేకరణలో జాప్యం పనులకు అడ్డంకిగా మారింది. రాష్ట్ర ప్రభుత్వం ఈ స్థల పూర్తి చేస్తే కేంద్రం ఈ బడ్జెట్‌లో నిధులు కేటాయించాల్సి ఉంది. గత బడ్జెట్‌లో కాజీపేట రైల్వేస్టేషన్‌లో రెండు అదనపు ఫ్లాట్‌ఫారాల మంజూరు చేసినట్లు ప్రకటించినా నేటికీ ఆ పనుల్లో కదలిక లేదు. కాగా కరోనా సమయంలో డోర్నకల్, గార్ల, మహబూబాద్, కేసముద్రం, నెక్కొండ రైల్వే స్టేషన్లలో హాల్టింగ్ రద్దు చేసిన రైళ్లను తిరిగి పునరుద్ధరించాలన్న డిమాండ్ ఉంది. పాండురంగాపురం భద్రాచలం రైల్వే లైన్లను ప్రారంభించి, రైల్వే బ్రిడ్జి పనుల్లో వేగం పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

అభివృద్ధి నిధులు అడిగాం..



"గిరిజనులు ఆదివాసీలు ఎక్కువగా ఉన్న మానుకోట పార్లమెంట్ పరిధి అభివృద్ధికి బడ్జెట్లో నిధులు కేటాయించాలని కోరాను. బయ్యారం ఉక్కు ఫ్యాక్టరీకి నిధులు కేటాయించి ఫ్యాక్టరీ నిర్మించి, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలన్నాం. మా పార్లమెంటు పరిధిలోని ప్రతి జిల్లాలో ఏకలవ్య స్కూల్ ఏర్పాటు చేయాలి.

– మాలోతు కవిత, ఎంపీ, మహబూబాబాద్

ప్రతిపాదనలు పంపించాను..



కేంద్ర బడ్జెట్ సందర్భంగా పలు ప్రతిపాదనలు చేశాం. గిరిజన యూనివర్సిటీతో పాటు నవో దయ, కేంద్రియ విద్యాలయాలను ఏర్పాటు చేయాలని అడిగా. కాజీపేట డివిజన్, పీఓహెచ్, వ్యాగన్ పరిశ్రమ, రైల్వే స్టేషన్ అభివృద్ధి కోసం నిధులు కావాలి. కాజీపేట నుంచి తిరుపతికి, షిర్డీకి కొత్త రైళ్లను వేయాలని కోరాం.

– పసునూరి దయాకర్, ఎంపీ, వరంగల్

కీలక ప్రతిపాదనలు చేశా..



ప్రజాసంక్షేమం, అభివృద్ధి కోసం పలు ప్రతిపాదనలు చేశాను. కాజీపేట– హసన్‌పర్తి – హుజూరాబాద్ – కరీంనగర్ మార్గం ఏర్పాటు విషయమై విన్నవించా. ఈ బడ్జెట్‌లోనూ రైల్వే ప్రాజెక్టుల పరంగా మంచి నిర్ణయాలుంటాయని భావిస్తున్నా.

– బండి సంజయ్, ఎంపీ, కరీంనగర్

పోక్సో కేసులో ముగ్గురు నిందితుల అరెస్ట్

- వివరాలు వెల్లడించిన ఏసీపీ గిరికుమార్

ఖిలా వరంగల్: మాయమాటలతో నిర్జీవ ప్రదేశానికి తీసుకెళ్లి మైనర్ బాలికపై సామూహిక ఆత్యాచారం చేసి పరారీలోఉన్న ముగ్గురు యువకులను పోక్సో కేసులో సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ ఏసీపీ కల్కోట్ల గిరికుమార్ తెలిపారు. సోమవారం వరంగల్ మట్టెవాడ ఏసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఇన్‌స్పెక్టర్ ముస్క శ్రీనివాస్‌తో కలిసి ఏసీపీ వివరాలు వెల్లడించారు. కాశిబుగ్గ ప్రాంతానికి చెందిన ఇంటర్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న ఓ 16ఏళ్ల బాలికకు ఓ స్నేహితురాలి ద్వారా నర్సంపేటలోని మాధన్నపేట గ్రామానికి చెందిన దూడల ప్రభాస్(19) పరిచయమయ్యాడు. ప్రేమతో పేరుతో ఆ బాలికకు దగ్గరై లైంగిక దాడికి ఒడిగడుతున్నాడు. ఈక్రమంలో బాలికను ఈనెల 24వ తేదీన ఇంటి నుంచి బయటకు రప్పించి బైక్‌పై దూపకుంట రోడ్డులోని నిర్జీవ ప్రదేశానికి దూడల ప్రభాస్ తీసుకెళ్లాడు. అతని స్నేహితులు సమీప బంధువులు పడమరకోట ఎస్సీ కాలనీకి చెందిన గద్దల భరత్(22), అదే ప్రాంతానికి చెందిన మైదం అవినాష్ అలియాస్ బన్నీ(19)లు కలిసి బాలికపై ఆత్యాచారానికి పాల్పడుతారు. ఆతర్వాత బాలికను మాధన్నపేటలోని తన ఇంటికి తీసుకెళ్లి అక్కడి నుంచి నేరుగా కాశిబుగ్గలోని తన ఇంటి వద్ద వదిలేశాడు. జరిగిన ఘటనపై ఈనెల 25వ తేదీ బుధవారం మిల్స్‌కాలనీ పోలీస్ స్టేషన్‌లో తల్లి సహకారంతో బాధిత బాలిక ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు పోక్సో కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి తప్పించుక తిరుగుతున్న ముగ్గురు కామాంధులు దూడల ప్రభాస్, గద్దల భరత్, మైదం అవినాష్ ఆలియాస్ బన్నిలను సోమవారం ఖిలావరంగల్ పెట్రోల్ బంక్ వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం నిందితులను కోర్టులో హాజరు పరచగా జడ్జీ ఆదేశాల మేరకు ఖమ్మం జైలుకు తరలించినట్లు ఏసీపీ తెలిపారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదు



ఖిలా వరంగల్: తనిఖీలు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

ఖిలా వరంగల్: వాహనానికి నంబర్ ప్లేట్స్, ట్యాంపరింగ్, నంబర్ ప్లేట్ మీద స్టిక్కర్ వేసి తిరుగుతున్న ఐదురుగు వాహనచోదకులపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు మట్టెవాడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాబులాల్ తెలిపారు. ఈమేరకు సోమవారం వరంగల్ శంభునిపేటలోని గవిచర్ల క్రాస్ రోడ్డుపై ఇన్‌స్పెక్టర్ బాబులాల్ ఆధ్వర్యంలో ఎస్సై రాజబాబు, ఆర్ ఎస్సైలు పూర్ణచందర్‌రెడ్డి, శ్రవణ్‌కుమార్ నేతృత్వంలో వాహన తనిఖీలు నిర్వహించారు. ఈతనిఖీల్లో టేకు శ్రీకాంత్, కందిక సురేష్, మార్త మాధవ్, ముప్ప చరణ్ నంబర్ ప్లేట్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నట్లు గుర్తించారు. వారి వాహనాలను సీజ్ చేసి, వారిపై మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో 420 చీటింగ్ కేసు నమోదు చేయించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో నలుగురికి జైలు

కాజీపేట: కాజీపేట పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 12 మందిని సోమవారం కోర్టులో హాజరుపర్చగా నలుగురికి రెండు రోజుల జైలు శిక్ష, 8 మందికి రూ.14వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి విద్యాసాగర్ రావు తీర్పునిచ్చినట్లు ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు. గుమ్మడి భద్రయ్య, మండ తిరుపతి, రావుల నీలాధర్, మాచర్ల రాజేందర్‌లకు జైలు శిక్ష విధించినట్లు చెప్పారు.

పోలీస్ కమిషనర్‌ను కలిసిన డీసీపీలు



సీపీ రంగనాథ్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న డీసీపీలు ఎం.ఏ బారీ, కరుణాకర్

వరంగల్ క్రైం: ఇటీవల నూతనంగా నియమితులైన సెంట్రల్ జోన్, ఈస్ట్‌జోన్ డీసీపీలు ఎం.ఏ బారీ, పి.కరుణాకర్‌లు వరంగల్ పోలీస్ కమిషనర్ ఏ.వీ రంగనాథ్‌ను సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలని అందించారు. ఈ సందర్భంగా శాంతి భద్రతలకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలతో పాటు, నియంత్రణకు అధికారులు చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై డీసీపీలకు సీపీ రంగనాథ్ పలు సూచనలు, సలహాలు అందజేశారు.

రోడ్డుపై పడిన కరెన్సీ

- జనం నుంచి రికవరీ చేసిన పోలీసులు



డబ్బులు లభించిన వ్యక్తి

వర్ధన్నపేట: ద్విచక్రవాహనం నుంచి పొరపాటున రోడ్డుపై పడిపోయిన కరెన్సీని దొరికినవి దొరికినట్లుగా ఏరుకుని తీసుకున్న వారి సమాచారం కనుగొని పోలీసులు వారి నుంచి రికవరీ చేసిన ఘటన సోమవారం సాయంత్రం వర్ధన్నపేట పట్టణంలో చోటుచేసుకుంది. వర్ధన్నపేట ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం సాయంత్రం ఖమ్మం వైపు నుంచి వరంగల్ వైపునకు వెళుతున్న ఓ ద్విచక్రవాహనంపై ఓ జంట ప్రయాణిస్తుండగా వర్ధన్నపేట కొత్త బస్టాండ్ సమీపంలో రూ.500 నోట్లు కింద పడ్డాయి. ఆ విషయాన్ని వారు గమణించలేదు. కింద పడ్డ నోట్లను కొందరు ఏరుకోగా ఓ వ్యక్తికి రూ.6,500, మరో వ్యక్తికి రూ.2,000, మరో గుర్తు తెలియని వ్యక్తికి రూ.3,000 వేలు లభించాయి. విషయం సోషల్‌మీడియాలో ప్రచారం కావడం పోలీసులకు సమాచారం అందడంతో వారు డబ్బులను తీసుకున్న వారిని గుర్తించి రూ.7వేలు రికవరీ చేసినట్లు ఎస్సై రామారావు తెలిపారు. మిగతా డబ్బులు తీసుకున్న వ్యక్తి బీహార్‌కు చెందిన గుర్తు తెలియని వ్యక్తి ఉన్నట్లుగా సమాచారం ఉందన్నారు.



మొదటి మ్యాచ్ విజేత సీడీసీ జట్టు



రెండో మ్యాచ్ విజేత వాగ్దేవి డిగ్రీ అండ్ పీజీ కాలేజీ

రసవత్తరంగా సాక్షి ప్రీమియర్ లీగ్

- క్రికెట్ పోటీలను ప్రారంభించిన ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ డీహెచ్‌రావు



పోటీలో తలపడుతున్న క్రీడాకారులు

రామన్నపేట: వరంగల్ ములుగు రోడ్డులోని లాల్ బహదూర్ కళాశాల మైదానంలో సాక్షి ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు రసవత్తరంగా కొనసాగుతున్నాయి. మూడో రోజు సాగిన క్రికెట్ పోటీలకు ముఖ్య అతిథిగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అరుణ, డీహెచ్‌రావు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. క్రీడాకారులు క్రీడాస్ఫూర్తితో పోటీల్లో పాల్గొనాలని సూచించారు. పోటీలకు ఎల్బీ కళాశాల మైదానం వేదిక కావడం సంతోషంగా ఉందన్నారు.

- మూడో రోజు మొదటి మ్యాచ్‌లో చైతన్య డీమ్డ్ యూనివర్సిటీ– నేతాజీ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. చైతన్య యూనివర్సిటీ టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకుంది. నేతాజీ ఫార్మసీ జట్టు 10 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 66 పరుగులు సాధించింది. అనంతరం బ్యాటింగ్ చేసిన చైతన్య యూనివర్సిటీ జట్టు 7.3 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించింది. ఈ మ్యాచ్‌లో నిఖిల్ 40 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- రెండో మ్యాచ్‌లో ఎల్బీ కళాశాల– సెయింట్ పీటర్స్ ఫార్మసీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన సెయింట్ పీటర్స్ బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 54 పరుగులు సాధించింది. ఎల్బీ కళాశాల జట్టు 3.4 ఓవర్లలో లక్ష్యాన్ని చేధించి అదరహో అనిపించింది. ఈ మ్యాచ్‌లో హరిప్రసాద్ 23 పరుగులు సాధించి మ్యాన్ ఆఫ్ దిమ్యాచ్‌గా నిలిచాడు.
- మూడో మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాల– అనంతలక్ష్మి ఆయుర్వేద కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన వాగ్దేవి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి 157 పరుగులు సాధించింది. ఆయుర్వేద కళాశాల జట్టు 10 ఓవర్లలో 40 పరుగులు మాత్రమే సాధించగలిగింది. దీంతో వాగ్దేవి జట్టు 117 పరుగుల భారీ తేడాతో విజయాన్ని సాధించింది. ఈ మ్యాచ్‌లో వాగ్దేవి కళాశాలకు చెందిన అబ్దుల్ వాసీ 63 పరుగులతో మైదానంలో మెరుపులు మెరిపించాడు.
- నాల్గో మ్యాచ్‌లో జయముఖి కళాశాల, శ్రీ అరుణోదయ డిగ్రీ కళాశాల జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన జయముఖి జట్టు బ్యాటింగ్ ఎంచుకుని 10 ఓవర్లలో 141 పరుగులు సాధించింది. అరుణోదయ జట్టు 5 ఓవర్లలో 44 పరుగుకే ఆల్ అవుట్ అయింది. దీంతో జయముఖి కళాశాల 103 పరుగులతో భారీ విజయాన్ని సాధించింది.



మూడో మ్యాచ్ విజేత ఎల్బీ కాలేజీ జట్టు



నాల్గో మ్యాచ్ విజేత జయముఖి కాలేజీ జట్టు

మేడారంలో బీటీ రోడ్డు నిర్మాణ పనులు, జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసి డ్రెస్సింగ్ గదులు, ట్యాప్స్, గద్దెల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు







మినీ జాతరకు సిద్ధం

ఏర్పాట్లు పూర్తి

- తరలిరానున్న లక్షలాది మంది భక్తులు
- విధుల నిర్వహణకు అధికారుల సన్నద్ధం

ఎస్ఎస్ తాడ్వాయి: మేడారం సమ్మక్క సారలమ్మ మినీజాతరకు అధికారులు సిద్ధమయ్యారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం అయా శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు పూర్తయ్యాయి. బుధవారం నుంచి మినీజాతర (మండమెలిగె) ఉత్సవాలు ప్రారంభయ్యే నేపథ్యంలో జాతరలో విధుల నిర్వహణకు జిల్లా అధికార యంత్రాంగం సంసిద్ధులవుతున్నారు. ఈ జాతరకు లక్షలాది సంఖ్యలో భక్తులు హాజరవుతారని అధికారుల అంచనా మేరకు ఏర్పాట్లు సిద్ధం చేశారు. జాతరకు ఒకే రోజు మాత్రమే గడువు ఉంది.

పూర్తయిన ఏర్పాట్లు..

మినీజాతరలో భక్తుల సౌకర్యార్థం అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆర్‌అండ్‌బీ ఆధ్వర్యంలో మేడారంలో 600 మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణం సోమవారం నాటికి పూర్తయింది. జాతరలో భక్తుల మలమూత్ర విసర్జన కోసం సులభ్ కాంప్లెక్స్ మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకొచ్చారు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు వద్ద శాశ్వతంగా నిర్మించిన మూడు డ్రెసింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులన్ని పూర్తయ్యాయి. జంపన్నవాగు వద్ద జల్లు స్నానాలకు బ్యాటరీ ఆఫ్ ట్యాప్‌లకు కనెక్షన్ ఏర్పాటు చేశారు పోలీసు శాఖ ఆధ్వర్యంలో భక్తుల వాహనాలు మళ్లించేందుకు పార్కింగ్ స్థలాలను సిద్ధం చేశారు.



అమ్మవార్ల గద్దెల ప్రాంగణంలో చలువ పందిళ్లు

ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో మిషన్ భగీరథ నీటిని భక్తులకు అందించేందుకు భక్తులు విడిది చేసే ప్రదేశాల్లో బ్యాటరీ ఆఫ్ ట్యాప్స్ ఏర్పాటు చేసి వాటర్ ట్యాంకుల ద్వారా తాగునీటి కనెక్షన్ అందించారు. జిల్లా పంచాయతీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో మేడారంలో భక్తులకు అందించే సౌకర్యాలకు వారికి తెలిసే విధంగా మేడారంలోని ప్రధాన దారుల వెంట ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో అమ్మవార్ల గద్దెల వద్ద భక్తుల రద్దీని పర్యవేక్షించేందుకు 20 సీసీ కెమెరాలను ఏర్పాటు చేయడంతో పాటు క్యూలో భక్తులు అమ్మవార్లను ప్రశాంతంగా దర్శించుకునేందుకు చర్యలు తీసుకున్నారు. కాగా, ఈఓ రాజేంద్రం దేవాదాయ శాఖ పనులన్నీ పూర్తయ్యాయని తెలిపారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగుకుండా అమ్మవార్లను దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేసామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ ఈఈ హేమలత మేడారంలో పర్యటించి ఆ శాఖ ఆధ్వర్యాన చేపట్టిన పనులను పరిశీలించారు. సులభ్ కాంప్లెక్స్ మరమ్మతులు, జంపన్నవాగు వద్ద డ్రెస్సింగ్ గదుల్లో ఎలక్ట్రీషియన్ పనులను పరిశీలించారు. నేటి నుంచి తమ శాఖ తరఫున చేపట్టిన సౌకర్యాలన్నీ భక్తులకు అందుబాటులోకి తీసురానున్నట్లు తెలిపారు.

భక్తుల మొక్కులు


సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మేడారం సమ్మక్క సారలమ్మలను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. జంపన్నవాగు వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద స్నానాలు ఆచరించి పుట్టు వెంట్రుకలు సమర్పించారు. అనంతరం సమ్మక్క సారలమ్మ, గోవిందరాజు, పగిడిద్దరాజులను దర్శించుకున్నారు. అమ్మవార్ల పసుపు, కుంకుమ, ఒడి బియ్యం ఎత్తు బంగారం సమర్పించారు. మొక్కుల అనంతరం మేడారం పరిసరాల్లో సేదతీరి వంట వార్పు చేసుకున్నారు.



అమ్మవార్లకు ఎత్తు బంగారంతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు

చైన్ స్నాచింగ్ కేసులో ముగ్గురి అరెస్ట్

- ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ కరుణాకర్

వరంగల్ క్రైం: ఐనవోలు దేవాలయం పరిసర ప్రాంతంలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన దొంగతో పాటు, ఈ కేసుతో సంబంధం ఉన్న మరో ఇద్దరు నిందితులను ఐనవోలు పోలీసులు సోమవారం అరెస్ట్ చేసినట్లు ఈస్ట్‌జోన్ డీసీపీ కరుణాకర్ వెల్లడించారు. నిందితుల నుంచి 40 గ్రాముల బంగారు అభరణాలతో పాటు రూ.1.80 లక్షల నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వరంగల్ జిల్లా గీసుకొండ మండలం వంచనగిరి ప్రాంతానికి చెందిన ఎల్లబోయిన హరీశ్ ఈనెల 21న యాదాద్రి జిల్లా బీబీనగర్ ప్రాంతానికి చెందిన గండు వసంత మొక్కులు చెల్లించుకునేందుకు ఐనవోలు జాతరకు రాగా.. ఎల్లమ్మ గుడి వద్ద ఆమె మెడలోని బంగారు పుస్తెల తాడును చోరీ చేశాడు. ఈ చోరీ పై బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఐనవోలు పోలీసులు దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఆధారంగా నిందితుడిని గుర్తించి కాశిబుగ్గ ప్రాంతంలో అదుపులోకి తీసుకొని విచారించగా నిందితుడు చైన్ స్నాచింగ్ చేసిన అనంతరం వంచనగిరి చెందిన మరో నిందితుడు శోభోతు భిక్షపతి సూచన మేరకు అతనితో కలిసి బంగారు పుస్తెల తాడుని నెక్కొండ మండలం అలంకారిపేట గ్రామానికి చెందిన బోయినపల్లి సూర్యప్రకాశ్‌కి విక్రయించగా.. ఇందుకుగాను నిందితులకు రూ.2.06 లక్షలు ఇచ్చాడు. ఇందులో ప్రధాన నిందితుడు హరీశ్ రూ.1.80 తీసుకుని ఇరవై వేలను భిక్షపతికి ఇచ్చినట్లు ప్రధాన నిందితుడు అంగీకరించినట్లు డీసీపీ తెలిపారు. నిందితుడి సమాచారం మేరకు మిగతా ఇద్దరు నిందితుల వద్ద నుంచి చోరీ సొత్తుతో పాటు నగదు, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ కనబర్చిన ఏసీపీ నరేష్‌కుమార్, సీఐ శ్రీనివాస్, ఐనవోలు ఎస్సై వెంకన్నని డీసీపీ అభినందించారు.

రాష్ట్రంలో రజాకార్ల పాలన

- బీజేపీ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ



మాట్లాడుతున్న రావు పద్మ

హన్మకొండ: రాష్ట్రంలో రజాకార్ల పాలన సాగుతోందని బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షురాలు రావు పద్మ మండిపడ్డారు. సోమవారం హనుమకొండ హంటర్ రోడ్డులోని వేద బాంక్వెట్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రావు పద్మ మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వానికి పోలీసులు తొత్తులుగా మారారని ధ్వజమెత్తారు. మంత్రి కేటీఆర్ కమలాపూర్ మండల పర్యటన సందర్భంగా రెండ్రోజుల ముందుగానే బీజేపీ, సహా విపక్ష పార్టీల నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆమె తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై పోరాడుతున్నందుకే తమ పార్టీ నేతలను అరెస్ట్ చేస్తున్నారన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ముందస్తు అరెస్టులు అన్యాయం

రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం అన్యాయమని పార్టీ నేతలు అభిప్రాయపడ్డారు. ఆ పార్టీ హనుమకొండ, వరంగల్ జిల్లా అధ్యక్షులు రావు పద్మ, కొండేటి శ్రీధర్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండె విజయరామారావు తదితరులు అరెస్ట్ అయి మడికొండ పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో ఉన్న కమలాపురం మండల నాయకులను సోమవారం కలిశారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ మంత్రి గుండె విజయ రామారావు, మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, మాజీ జెడ్పీటీసీ సాంబరావు, దేశిని సదానందంగౌడ్, మాట్ల రమేష్, పాశికంటి రాజేంద్రప్రసాద్, సత్యనారాయణ, కిరణ్, వెంకట్‌రెడ్డి, సాంబరావు, భాస్కర్, సంపత్, సతీశ్, కరుణాకర్‌గౌడ్, తదితరులున్నారు.